# పందిరి మంచం

"తొందరగా భోంచెయ్యండి !" అన్నంలో మజ్జిగపోస్తూ హెచ్చరించింది అన్నపూర్ణ.

"హాల్లో కుర్చీ వాల్చావా ?" అడిగేను.

"ఆ !... పేపరు కూడా అక్కడే పెట్టేను !" చెప్పింది అన్నపూర్ణ తాను కూడా అన్నం వడ్డించుకుంటూ.

"నువ్ కూడా తొందరగా తెముల్చుకుని రా !" చేతులు కడుక్కుని లేస్తూ అన్నాను.

మేం తొందరగా భోజనంచేసి-పోస్ట్‌మేన్‌కోసం ఎదురుచూడటం తప్ప వేరే వెలగపెట్టవలసిన రాచకార్యాలు ఏం లేవు.

సరిగా పదకొండయ్యేసరికి మా వీధిలోకి పోస్టుమాన్ వస్తాడు. అప్పటికి మేమిద్దరం భోజనంచేసి హాల్లోకి చేరతాం, అన్నపూర్ణ వీధి గుమ్మం గడప దగ్గరే తలుపు నానుకొని కూర్చుంటుంది. పేపర్లో తలపెడతానన్నమాటేగాని నా దృష్టికూడా వీధివేపే ఉంటుంది.

"ఇవాళ నందూ తప్పకుండా ఉత్తరం రాస్తాడు. పొద్దున్నుంచీ బాదం చెట్టుమీద కాకులు చేరి తెగ అరుస్తున్నాయ్" మరి కాసేపటికి వంటగదిలో పని పూర్తిచేసుకుని వచ్చిన అన్నపూర్ణ గడప దగ్గర కూర్చుంటూ అన్నది.

బొంబాయినుంచి నందూగానీ, హైదరాబాదునుంచి శంకరంగానీ, బెంగుళూరునుంచి రాజాగానీ ఉత్తరం రాస్తారని ప్రతిరోజు మేం అలా

పోస్ట్‌మాన్ కోసం ఎదురుచూస్తూనే వుంటాం. కాని... మా పిచ్చి కాకపోతే రోజూ ఎందుకు వస్తాయ్ ఉత్తరాలు ?

నందూకి ఉత్తరాలు రాసే అలవాటు తక్కువ. నేను నాలుగు ఉత్తరాలు రాస్తే నాలుగోదానికి జవాబిస్తాడు. శంకరం ప్రతినెలా జీతం రాగానే నాకో యాభై రూపాయలు మనియార్డరు చేస్తూ, ఆ మని యార్డరు కూపన్‌లోనే "అంతా క్షేమం' అని ఓ ముక్కరాసి వూరు కుంటాడు. ఇక మూడోవాడు రాజా మాత్రం వారానికో ఉత్తరం మర్చి పోకుండా రాసేవాడు. వాడికూడా పెళ్ళయి సంసారబాధ్యతలు పెరి గితే ఆ మాత్రం కూడా రాయడేమో ?

ఎప్పుడైనా పిల్లలెవరైనా శలవుమీద ఇంటికొచ్చే నాలుగురోజు లుంటే అరవయ్యేళ్ళ అన్నపూర్ణకి ఇరవయ్యేళ్ళ చురుకుదనం వచ్చే స్తుంది. వాళ్ళకు ఇష్టమైన పిండివంటలు చేసి-బలవంతంగా వాళ్ళ చేత కొసరికొసరి తినిపిస్తుంది.

వాళ్ళు మళ్ళీ తిరిగి వెళ్ళిపోతుంటే వీధిగుమ్మం దగ్గర నిలబడి సాగనంపుతూ—

"ముసలాళ్ళం మేమిద్దరం బిక్కుబిక్కుమంటూ ఇక్కడున్నామని మర్చిపోకండిరా నాలుగురోజులకొకసారయినా ఉత్తరంముక్క రాస్తుం డండి. ఆ ఉత్తరం చూస్తే మాకు మిమ్మల్ని చూసినట్టే వుంటుంది. పైగా మీరు వుత్తరాలు రాయటంలేదని నాన్నగారు ఎంత బాధపడు తుంటారో తెలుసా ?" నా మనసులో బాధనుకూడా గ్రహించి వాళ్ళకు చెబుతుంది.

అప్పుడు—

అన్నపూర్ణ అలా అంటున్నప్పుడు నాకెందుకో చటుక్కున

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత అన్నపూర్ణ కూడా పైటచెంగుతో కళ్ళొత్తుకుంటూ లోపలికొస్తుంది.

ఆ క్షణంనించీ మళ్ళీ కొన్నాళ్ళు ఇల్లంతా నిశ్శబ్దం...మనసంతా స్తబ్దత....మళ్ళీ ప్రతిరోజూ ఉత్తరాలకోసం ఎదురుచూడటం....

"మీకేమండీ-రత్నాల్లాంటి ముగ్గురు పిల్లలు!" అంటూండేవారు ఆంజనేయులుగారు అప్పుడప్పుడు.

నిజమే! ముగ్గురు బాగా చదువుకున్నవారు. ముగ్గురు మూడు మహానగరాల్లో మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కానీ, ఎవరికి వారే-యమునాతీరే! పోనీ మేంకూడా వాళ్ళదగ్గరకే వెళ్ళి వుందామంటే ఆ మహానగరాల్లో, అక్కడి అద్దెకొంపల్లో....వాళ్ళకు ఇబ్బందిగా ఎన్ని రోజులుండగలం? అసలు ఎంతకాలం వుంటే మాత్రం కరువు తీరుతుంది?

పైగా పాతికేళ్ళనించి వుంటున్న ఊరు....సొంతయిల్లూ వదిలిపెట్టి వెళ్ళాలన్నా బాధగానే వుంటుంది.

ఇన్నాళ్ళూ పక్కవాటాలో వుండే ఆంజనేలుగారితో అంతోఇంతో కాలక్షేపం అయిపోయేది. ఆయన పోయింతర్వాత క్షణం నిశ్శబ్దం కూడా యుగాల మౌనంలా అనిపిస్తోంది.

ఆంజనేలుగారు పదేళ్ళక్రితం—మా స్కూలుకి ట్రాన్స్ఫరై వచ్చారు.

ఆ స్కూల్లో మేమిద్దరం సైన్సు మాస్టర్లమే కావటంవల్ల స్నేహితులమయ్యాం. అప్పట్లో మా యింట్లో ఓ వాటా ఖాళీగా వుండటంవల్ల దాన్ని ఆయనకు అద్దెకు ఇవ్వడంతో మేమిద్దరం మరింత స్నేహితులమైపోయాం. స్కూలుకి కలిసి వెళ్ళేవాళ్ళం. కలిసే వచ్చేవాళ్ళం. రెండు నెలల తేడాతో ఇద్దరం ఒకేసారి రిటైరయ్యాం. అప్పుడుకూడా

ఆంజనేలుగారు ఇల్లు ఖాళీచేయకుండా మా యింట్లోనే ఉండిపోయారు. పిల్లలు కొంతడబ్బు పంపేవారు. దానికితోడు ఆయనకొచ్చే పెన్షన్‌తో హాయిగానే కాలక్షేపం చేసేవారు.

ప్రతిరోజూ సాయంత్రం మేమిద్దరం ఊరిచివర మామిడితోటకు వెళ్ళి కూర్చునేవాళ్ళం. ఆయన తన పిల్లల గురించీ, నేనూ నా పిల్లలగురించీ చెప్పుకునేవాళ్ళం.

ఓరోజు రాత్రి ఆయనకు హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. అప్పటికప్పుడు నేనే పక్కనున్న టౌనుకు తీసుకెళ్ళి-ఆస్పత్రిలో చేర్పించాను. ఎక్కడెక్కడో వుంటున్న ఆయనగారి పిల్లలకు టెలిగ్రాంలు ఇచ్చాను. కానీ వాళ్ళు వచ్చేసరికి అంతా అయిపోయింది. కర్మ చేయటం తప్ప కటిచూపు వాళ్ళకు దక్కనేలేదు పాపం!

ఆ సంఘటన నాలో ఓ రకమైన నిర్లిప్తతనో వైరాగ్యాన్నో కలిగించిందని చెప్పక తప్పదు. ఆదమరచి నిద్రపోయే కళ్ళలోకి పీడకల ఏదో వచ్చినట్టనిపించింది.

"అసలేమిటి ఈ జీవితం? ప్రతి మనిషీ చావటానికే పుట్టినప్పుడు చావు తప్పనప్పుడూ-ఇంతకాలం ఈ బ్రతుకులో మమకారాల్ని ప్రేమల్నీ ఆప్యాయతల్నీ పెంచుకోవటం వృధాయేనా? మరణమే యదార్థమైనప్పుడు బ్రతుకంతా ఓ కలేనా?

ఆంజనేలుగారి మరణం నాలో అలాంటి ఆలోచనల్ని రేకెత్తిస్తే అన్నపూర్ణలో మరోరకమైన వైరాగ్యాన్ని కలిగించింది

ఆయన పోయిన పదోరోజున కాబోలు-రాత్రి పడుకోబోయే ముందు—

"ఏమండీ....ఈసారి సంక్రాంతి పండక్కి పిల్లలు ముగ్గుర్నీ రమ్మని ఉత్తరాలు రాయండి" అంది అన్నపూర్ణ పందిరిమంచం క్రింద మంచినీళ్ళచెంబు పెడుతూ.

"మనం రాయటమేకానీ వాళ్ళు రావద్దూ ? అన్నాను.

"తప్పనిసరిగా రమ్మని రాయండి. నేను మరీమరీ రాయమన్నానని చెప్పి రమ్మనండి." అలా అంటూంటే అన్నపూర్ణ కంఠం వణకటం నేను గ్రహించాను. ఆమె కళ్లలో తడి కదలటంకూడా కనిపించింది.

"అలాగే రాస్తాన్లే"

"ఈగొలుసూ, నాంతాడూ, గాజులూ ఇవన్నీ కోడళ్ళకు ఇచ్చేస్తానండీ. ఈ పందిరిమంచంకూడా." ఇక అన్నపూర్ణ కళ్లల్లో నీరు ఆగలేకపోయింది.

"ఏమిటోయ్ ఇది ? ఎందుకలా కన్నీరు పెట్టుకుంటావ్ ?" దగ్గరకు తీసుకుంటూ అడిగాను.

నా భుజాలు ఆమె కన్నీటితో తడిసిపోయాయే తప్ప వెంటనే మాట్లాడలేకపోయింది.

"ఏమయిందోయ్ ఇప్పుడు ?" మళ్ళీ అడిగాను.

"ఏంకాలేదండీ బతికినంతకాలం మనం ఎలాగా బతకం పోయేటప్పుడు ఈ నగలూ, ఈ పందిరిమంచం వీటన్నిటినికూడా తీసుకెడతామా చెప్పండి ? మనం పోయినతర్వాతనైనా వీటిని పిల్లలు తీసుకోవల్సిందేగా ? ముందే మనం ఇచ్చేస్తే మనం బతికున్న నాలుగు రోజులూ వాళ్ల ఆనందాన్ని మనం కళ్ళారా చూడచ్చు." పైట చెంగుతో కళ్ళొత్తుకుంటూ చెప్పింది అన్నపూర్ణ.

అన్నపూర్ణ చెప్పిందాట్లో నాకు యదార్థం కనిపించింది.

నిజమే మరి!

ఏక్షణంలో ఏంజరుగుతుందో ఎవరు ఊహించగలరు కనుక? సృష్టిస్థితిలయాలను తన గుప్పెట్లో పెట్టుకొని కీలుబొమ్మల్లాంటి మనుషుల జీవితాల్లోని ఘటనా సంఘటలన్నీ తానే నిర్దేశించుతాడు ఆ భగవంతుడు. మనుషులమధ్య బంధాల్ని ఏర్పరచుతాడు. ఆ బంధాల ఉచ్చులో మనిషి పూర్తిగా బిగిసిపోయి-వాటిపై మమతలను పెంచుకునే లోగా వాటిని పుటుక్కున త్రెంచేస్తాడు.

ఓ సారెప్పుడో ఓ కథలో చదివాను.

"ఎక్కడో పుడతాం....మరెక్కడో పెరుగుతాం....చివరికెక్కడో రాలిపోతాం....అనంతకోటి విశ్వంలో ఎన్నోజన్మల పరిమాణంలో ఈ మానవజన్మ ఎని క్షణాలు? ఈ ఒకటి రెండు క్షణాల్లోనే ఎంతటి ఆత్మీయతలూ? ఎన్నివేల అనుబంధాలు?"

నిజం. జీవితమంటే రంగురంగుల గాలిపటం. కానీ ఎప్పుడో ఒకప్పుడు దాని దారం తెగిపోతుంది.

అందుకే చేద్దామనుకున్న మంచిపని ఏదైనా వుంటే చేసెయ్యటం మంచిది. ఆమంచే మనిషి మరణించినా వెంటవస్తుంది.

"ఏవండీ! అడుగోనండీ మన ఇంటికే వస్తున్నాడు." అన్నపూర్ణ ఉత్సాహంగా అనటంతో నా ఆలోచనలు ఆగిపోయాయి.

పరధ్యానాన్ని పక్కన పెట్టి - ఎదురుగా చూసేసరికి గుమ్మంలో దేవుడు ప్రత్యక్షమయ్యాడు.

దేవుడంటే ఎవరోకాదు-పోస్టుమాన్.

మాపిల్లలు రాసిన ఉత్తరాలను భద్రంగా తీసుకొచ్చి మాకు సంతోషాన్ని కలిగిస్తాడు కనుక-అతగాడ్ని దేవుడితో సమానంగా చూసుకుంటాం.

"మీకు లెటరుంది సార్ !" అంటూ ఓ కవరు నావైపు పడేసి వెళ్ళిపోయాడు దేవుడు.

ఆత్రంగా దాన్ని తీసుకున్నాను.

"చూశారా ! నే చెప్పలే ? ఇవాళ నందూనుంచి ఉత్తరం వస్తుందని ?" ఉత్సాహంగా నావైపు చూసింది అన్నపూర్ణ.

"నందూ కాదు.... హైదరాబాద్ నుంచి శంకరం రాశాడు"— ఒక్క నిమిషంలో ఉత్తరం చదవటం పూర్తిచేసి చెప్పేను.

"ఏంరాశాడు పైకి చదవండి....వింటాను" ఆత్రంగా అడిగింది.

"....నాన్నగారికి నమస్కారములు. మీరు అమ్మా కులాసా అని తలుస్తాను. మొన్నీమధ్య ఓ యిల్లు అమ్మకానికొస్తే అనుకోకుండా కొనేశాను. డెభ్భైవేలు.... నా దగ్గర ఓ ముప్పయి వు టే మరో నలభై మా కంపెనీవాళ్ళు అప్పు ఇచ్చారు. ఇల్లు చాలా విశాలంగా వుంది. మొత్తం ఆరుగదులున్నాయి. ఇంకో అయిదారువేలు ఖర్చు పెడితే కొత్త ఓల్డింగులా తయారవుతుంది.... ఆ పనులుకూడా ప్రారంభిస్తున్నాను.... మీరు అమ్మా వీలుచూసుకొని తప్పక రావలెను. మీ కోడలు కులాసా...." చదివి వినిపించేడు.

"ఎలాగైనా శంకరం అదృష్టవంతుడండీ అంది అన్నపూర్ణ తృప్తిగా చూస్తూ.

ఔను !

నేను చేయలేని పని వాడు చేయగలిగాడంటే అదృష్టంకాదూ ?

మా తాత కట్టించిన ఇల్లు మా నాన్నగారికొస్తే - అందులో నాలుగోభాగం నాకోవాటా వచ్చింది. బడిపంతులుగా నాకొచ్చిన జీతంతో రెండేళ్ళకొకసారి ఈవాటాకి సున్నం వేయించటమే గగనమయి పోయింది.

అప్పో సప్పో చేసి ముగ్గురుపిల్లలకూ చదువు చెప్పించగల గటమే ఓ ఘనకార్యమని నేను అప్పుడప్పుడు అనుకుంటాను.

అలాంటిది ఇంత చిన్న వయసులో శంకరం ఇల్లు కొన్నాటంటే అదృష్టవంతుడు కాక మరేమిటి ?

కానీ....భగవంతుడు వాడికింకా పిల్లల్ని ప్రసాదించకపోవటం ఏదో లోటుగానే నాకు అనిపిస్తూంటుంది. పెళ్ళయి పదేళ్లయినా వాడికా అదృష్టం కలగలేదనే-నా పందిరిమంచాన్ని వాడికి పంపించాను.

"మరి మనం ఎప్పుడు బయల్దేరదాం ?" అడిగింది అన్నపూర్ణ.

"తొందర్లోనే వెడదాంలే !" సంతృప్తిగా నిట్టూర్చేను.

పిల్లలు వృద్ధిలోకొచ్చి ప్రయోజకులైతే తల్లిదండ్రులకు ఆనందం కలుగుతుంది. ఆ ఆనందంలో ఆకలీ నిద్రా కూడా దూరమవుతాయి.

అందుకే కాబోలు ఆ రాత్రి ఎంత పొద్దుపోయినా నిద్ర పట్టటం లేదు. గతంలోని జ్ఞాపకాలు వర్తమానపు ఆలోచనలతో పోటీపడటం ప్రారంభించాయి.

శంకరం ఇల్లు కొన్నాడు....

అంటే అది నా ఇల్లె !.... నా ఇంటిలో నా కొడుకు ఆదరణలో హాయిగా సేదతీర్చుకోవచ్చు. మళ్లీ మరోసారి నా పందిరి మంచం మీద నేను పడుకోవచ్చు ..

"అన్నపూర్ణ కూడ నా ప్రక్కన-ఆ పందిరిమంచంమీద పడుకొంటే ?"—

ఛ !....ఈ వయసులో ఇదేం ఆలోచన ?

అయినా నేనూ అన్నపూర్ణా ఎన్నిరాత్రులు ఆ మంచంమీద 'కలసి' పడుకోలేదూ ?

ఆ పందిరిమంచంమీద పడుకుంటే ఎంత హాయిగా ఉండేదనీ ?

నాకు ఎనిమిదేళ్ళ వయసప్పుడనుకుంటాను—

ఆ పందిరిమంచాన్ని మా నాన్నగారికి ఓ పేషెంటెవరో స్వయముగా తయారుచేసి బహూకరించేడు.

ఎత్తుగా ఎంతో విశాలంగా వుండేది. నల్లసరుగుడు చేవతో చేసిన మంచం కావటంవల్ల ఎప్పుడూ నిగనిగలాడుతుండేది.... అప్పట్లో అంటే సుమారు ఏభై ఏళ్ళ క్రితం వందరూపాయలు పెట్టి ఆ మంచం మీదకు పరుపూ రెండు తలగడాలు కుట్టించారు నాన్నగారు...

నాకు ఇప్పటికి బాగా జ్ఞాపకం—

పరుపుమీద ఎప్పుడూ తెల్లదుప్పటి వుండవలసిందే....నాన్నగారు డాక్టరుకావటంవల్ల కాబోలు తెలుపంటే ఆయనకు ప్రాణం....! తలగడకు కూడా తెల్లటి గలేబులుండేవి....ఆ గలేబులమీద రంగురంగుల దారాలతో అమ్మ కుట్టిన రామచిలుకలు !....మంచానికి తలదిక్కున అద్దం కూడా బిగించి వుండేది... అంతపెద్ద మంచనికి సరిపడే దోమతెర ఎక్కడా దొరక్కపోతే చేనేత వస్త్రాలయంలో పల్చగా వుండే తెల్లటి గుడ్డకొని దోమతెర ప్రత్యేకంగా కుట్టించారు నాన్న....

ఆ మంచం వచ్చిన కొత్తలో దానిమీద పడుకోవాలని నాకు చాలాసార్లు అనిపించేది. కాని నాన్నగారంటే భయంవల్ల అలాంటి

ప్రయత్నం చేసేవాణ్ణికాదు. పైగా దానిపైకి ఎక్కాలంటే ఏ స్టూలో వేసుకొని ఎక్కవలసిందే!

ఓరోజు సాయంత్రం-

నన్ను ఇంట్లోపెట్టి అమ్మ పేరంటానికి వెళ్ళింది...నాన్నగారు పేషెంటుని చూడటానికి ఊళ్ళోకి వెళ్ళేరు.

అదే సమయమనుకుని పెరట్లోంచి స్టూలు తెచ్చుకుని నెమ్మదిగ పందిరిమంచం ఎక్కేను. హాయిగ కాలుమీద కాలువేసుకుని పడు కున్నాను. కళ్ళు మూసుకోగానే అనుకోకుండా నిద్రపట్టేసింది.

కానీ ఆ హాయీ, ఆ నిద్రా ఎంతోసేపు నిలవలేదు...కొన్ని నిమిషాలకి ఇంటికి తిరిగివచ్చిన నాన్నగారు నా వీపు విమానంమోత ఎక్కించారు.

"మరోసారి మంచంమీద ఎప్పుడైనా ఎక్కేవంటే కాళ్లు విరగ్గొడ తాను జాగ్రత్త?" అని హెచ్చరించారు.

ఆయన కొట్టినందుకు కాదుగానీ పరుపుమీద వున్న తెల్ల దుప్పటి నామూలంగ మాసిపోయినందుకు నాకెంతో బాధకలిగింది.

మళ్ళీ ఎప్పుడూ ఆ పందిరిమంచం ఎక్కిన జ్ఞాపకం లేదు. హైస్కూల్లో చదువు పూర్తవగనే ఏలూరు కాలేజీలో చెరాను. అక్కడ డిగ్రీ తీసుకున్నాక రాజమండ్రిలో 'బిఇడి' చదివేను. అది పూర్తయిన వెంటనే 'మేష్టరు' ఉద్యోగం వచ్చేసింది.

ఉద్యోగంలో చేరిన నాలుగేండ్లకు నాకు అన్నపూర్ణను పెళ్ళ యింది. పెళ్ళయిన మర్నాడు

"ఆ ముచ్చటకూడా జరిపించేద్దాం" అన్నారు నాన్న.

"ఆ ముచ్చట మా ఇంట్లోనే జరగాలి" చెప్పారు నాన్నగారు.

'కానీ సాంప్రదాయం ప్రకారం ముందుగా" అని ఏదో చెప్ప బోతున్న మావగార్ని మరి మాట్లాడనివ్వలేదు నాన్నగారు.

"వీల్లేదండీ! మా యింట్లో జరగాల్సిందే! మీరు మరోమాట చెప్పకండి!" ఖచ్చితంగా చెప్పేశారు నాన్న.

ఆ రాత్రి....

అదే మొదటిరాత్రి....మా వూళ్ళో....మా....ఇంట్లో .... మా నాన్నగారి గదిలో....

ఆ పందిరిమంచాన్ని నాకూ, అన్నపూర్ణకీ వదిలేశారు.

మంచంమీద తెల్లనిదుప్పటీ....ఆ దుప్పటిపైన అప్పుడే విచ్చుకుం టున్న మల్లెపూలు....తలగడాలకు తెల్లని గలేబులు....ఆ గలేబులపైన అందమైన రామచిలుకలు పందిరిమంచం మీదనుంచి క్రిందకు పరుచు కున్న తెల్లని దోమతెర!

అప్పుడు ఆ క్షణాన నాకు ఉత్సాహం కలుగలేదు.

తాను ఎంతో ప్రాణప్రదంగా చూసుకొంటున్న పందిరిమంచాన్ని నాన్నగారు నాకు అప్పగించి, వసారాలో ఎక్కడో మూలగా ఓ మడత మంచం వాల్చుకుని పడుకున్నారనే ఊహ నాలో ఆవేదన కలిగించింది.

ఆ రాత్రి అన్నపూర్ణతో దొరికే ఆనందంకంటే, ఆ విశాలమైన పందిరిమంచం పరుపుమీద మనసారా పడుకుంటున్నాననే ఆనందమే ఎక్కువనిపించింది.

ఓ రాత్రివేళ వసారాలో పడుకున్న నాన్నగారు అమ్మతో అం టూంటే వినిపించింది—

"ఇకనించీ మనకీ మడతమంచాలు చాలునోయ్. పందిరిమంచం పెద్దాడికి ఇచ్చేద్దాం!"

"ఔనండీ! ఆ పేషెంటెవరో చల్లని మనసుతో ఇచ్చాడు. మనం పదిహేనేళ్ళు అనుభవించాం. అది వచ్చింతర్వాత మనకి ముగ్గురు పిల్లలు పుట్టేరు. అందరూ హాయిగా వున్నారు. మన పెద్దాడికి కూడా తొందరగా పిల్లలు పుట్టి వాడు సుఖంగా వుంటే మనకంతకంటే ఇంకేంకావాలి?"-అమ్మ ఆమాటలంటూంటే నా కళ్ళు చెమ్మగిల్లాయి.

పక్కనే అన్నపూర్ణ గమనించకుండా వుండేందుకు నా చూపుల్ని కిటికీవైపు మరల్చాను.

అప్పుడు.... ఆ కిటికీ అవతల పిండారబోసినట్టున్న వెండి వెన్నెల్లో దానిమ్మ చెట్టు కొమ్మమీద నాకో దృశ్యం కనిపించింది.

చిన్నచిన్న పుల్లముక్కలతోనూ గడ్డిపరకలతోనూ కట్టిన ఓ అందమైన పిచ్చుకగూడు.... ఆ గూటిలోంచి మాంసం ముద్దల్లా వున్న లేత పిచ్చుక పిల్లలు ముక్కులు బయటకు పెట్టి చూస్తూంటే గూటిపైన కాపలా వస్తున్న రెండు పెద్ద పిచ్చుకలు తమరెక్కలతో వాటిని కప్పుతూ ప్రేమగా వాటికేదో ఆహారాన్ని అందిస్తున్నాయి.

ఎంతటి అందమైన దృశ్యం!

పిల్లలకు రెక్కలొచ్చి ఎగిరిపోతాయని తెలిసినా-ఆ పిచ్చుకల జంట వాటి శ్రేయస్సుకోసం ఎంతగా తాపత్రయపడుతున్నాయి?

"ఏవండీ! నిద్ర పట్టటంలేదా?" ఆలోచనల్లాగని నేనుకూడా మంచంమీద అటూ ఇటూ దొర్లుతూంటే – అన్నపూర్ణ గమనించి అడిగింది.

"ఇవాళెందుకో నిద్రరావటం లేదోయ్ !"

"ఔన్లెండి. మన అబ్బాయి ఇల్లు కొన్నాడన్న ఆనందంలో మనకి నిద్ర ఎలా వస్తుంది ?" మంచినీళ్ళు అందించింది అన్నపూర్ణ.

"మనం హైదరాబాద్ వస్తున్నట్లు రేపే అబ్బాయికి టెలిగ్రాం ఇస్తాను. ఎల్లుండే మన ప్రయాణం !" మంచినీళ్ళు తాగి, పడు కుంటూ చెప్పేను.

ఆ నిర్ణయం తీసుకొన్న తర్వాతగాని నాకు నిద్రపట్టలేదు. నాలుగో రోజు పొద్దున్న తొమ్మిదయ్యేసరికి నేనూ, అన్నపూర్ణా హైదరాబాద్ చేరుకున్నాం. మమ్మల్ని రిసీవ్ చేసుకోవటానికి శంకరం స్టేషన్ కి వచ్చాడు.

ముగ్గురం ఆటో ఎక్కేం...

"నిన్న మంచిరోజని శాస్త్రిగారు చెబితే కొత్త ఇంట్లో పాలు పొంగించేసి, సింపుల్ గా సత్యనారాయణవ్రతం చేసుకున్నాం" దార్లో చెప్పేడు శంకరం.

"ఇల్లు బావుందా ? నీళ్ళకు సౌకర్యంగా వుందా ?" అడిగింది అన్నపూర్ణ.

"ఓ....పొద్దున్నే ఓ గంటా - మళ్ళీ సాయంత్రం ఓ గంటా - కుళాయి వస్తుంది. పెరట్లో నుయ్యికూడా వుంది" చెప్పేడు శంకరం.

మరి కొన్ని నిముషాల్లోనే ఆ యింటి ముందు ఆగింది ఆటో.

ఇల్లు చాలా బాగుంది. గదులు కూడా విశాలంగా వున్నాయి. ఇంకా సామాన్లు సర్దలేదు కాబోలు - అన్నీ చెల్లాచెదురుగా పడివున్నాయి.

"కుర్చీలూ మంచాలూ కట్టలు కట్టి తెచ్చేం. ఇంకా విప్పలేదు. రేపు ఆదివారం కదా - ఆయనకు తీరికయితే వాటి సంగతి చూడాలి" పక్కవారింట్లోంచి రెండు గాడ్రెజ్ కుర్చీలు తెచ్చి మాకు వేస్తూ చెప్పింది కోడలు.

ఇంటికి రాగానే వేడినీళ్ళ స్నానంచేసి-పెంద్రాళే భోజనం చేసి హాయిగా పందిరిమంచంమీద ఆదమరచి నిద్రపోవాలనుకున్న నాకు కొంచెం నిరాశే కలిగింది.

అయినా—

అంతకుముందు రాత్రి రైల్లో నిద్రలేకపోవటం వల్ల చాపమీద పడుకున్నా మంచి నిద్ర పట్టేసింది.

సాయంత్రం నాలుగయింతర్వాత నిద్రలేచి, టీతాగి కాసేపు సిటీలో తిరిగొద్దామని బయల్దేరాను. రోడ్డుమీదకు వచ్చేసరికి కోఠీ వెళ్ళే బస్సు కనిపించింది. ఎక్కి కూర్చున్నాను.

అరగంటయ్యేసరికి బస్సు కోఠీలో ఆగింది. క్రిందకు దిగి బజారు చూస్తూ నడుస్తున్నాను.

సరిగ్గా సెంట్రల్ బ్యాంకు దగ్గరకొచ్చేసరికి నాకాళ్ళు అప్రమత్తంగా ఆగిపోయాయి.

అక్కడ బ్యాంకుకి ఎదురుగా పెద్దషాపు ఆషాపు ముందు ఓ చిన్న బల్లమీద నిలబడ్డ మనిషి వేలంపాట పాడుతున్నాడు.

"ఇది మామూలు మంచం కాదుసార్! షాజహాన్ చక్రవర్తి తన ప్రియురాలికోసం చేయించిన స్పెషల్ మంచం. దీన్ని చాలా కాలం ఢిల్లీ మ్యూజియంలో పెడితే, అక్కణ్ణించి కొనుక్కొచ్చి

ఇక్కడ వేలం వేస్తున్నాం. దీని కర్ర చూడండిసార్ ఇప్పటికీ ఎంత స్ట్రాంగ్‌గా వుందో? ఒక్కరుకాదు, ఇద్దరుకాదు, ముగ్గురూ నలుగురూ కూడా పడుకోవచ్చు! ఈ మంచానికి ఫిట్ చేసిన 'అద్దం' ఒక్కటి రెండువందలు ఖరీదు చేస్తుంది సార్! మొత్తం మంచం మూడు వందలకు పాట ప్రారంభిస్తాం: కావలసినవారు పాడుకోవచ్చు సార్! మూడువందలు".

వాడి మాటలు నాకు వినిపించటంలేదు. అక్కడున్న జనాన్ని తప్పించుకుని లోపలకు నడిచాను.

అక్కడ వున్న పందిరి మంచాన్ని చూసేసరికి నా ఒళ్ళంతా చెమటలుపోశాయి. కళ్ళకు చీకట్లు కమ్మసాగాయి.

"ఈ పందిరిమంచం ఇక్కడికెలా వచ్చిందీ?" నాలో నేనే ప్రశ్నించుకున్నాను. కాని, నా వేలంపాట మనిషికి నా మాటలు వినిపించాయి కాబోలు వెంటనే చెప్పేడు రెట్టింపు ఉత్సాహంతో.

"ఢిల్లీ మ్యూజియంనించి తెప్పించాం సార్! కావలసినవారు పాడుకోవచ్చు."

"4 వందలు" జనంలోంచి ఎవరో అన్నారు!

నేను పందిరిమంచానికి మరింత దగ్గరగా వెళ్లేను దానికి బిగించిన అద్దం కింద చూశాను.

అక్కడ....ఆ ఫ్రేం మీద 'రాధాకృష్ణ' అనే అక్షరాలు కనిపించేయి...అది నాన్నగారి పేరు.

ఆయన జ్ఞాపకార్థం నాకిచ్చిన మంచం కనక నేనే ఆయన పేరును మేకుతో చెక్కేను ఓసారి.

"మీరేం చూడక్కర్లేదుసార్. ఇవాల్టి కర్రతో చేసిన మంచం కాదు. నల్లవిరుగుడు చేవ. గేరంటీ సరుకు. నాలుగు వందలు!" నాకు చెప్తూనే పాట సాగిస్తున్నాడతను.

నా ఒళ్ళు చెమటతో తడిసిపోతోంది.

ఈ మంచం ఇక్కడకు వచ్చిందంటే దీన్ని...శంకరం అమ్మేశాడన్నమాట.

"ఈ పందిరిమంచాన్ని నాన్న ఎలా చూసుకునేవారు? ఇదంటే తనకెంతిష్టం?".

'అసలు శంకరానికి ఈ మంచం ఇవ్వటం నాదే తప్పు'

పెళ్ళయి పదేళ్ళయినా పిల్లలు కలగలేదని జాలిపడి ఈ మంచం వున్న ఇంట్లో సంతానానికి లోటుండదని అన్నపూర్ణ పదేపదే చెప్పటం వల్ల నా మమకారాన్ని కూడా చంపుకొని శంకరానికి ఇచ్చేను.

'కానీ వాడేం చేశాడు? కోపం నా నరాల్లోకి పాకుతోంది.

"ఒకటోసారి నాలుగు వందలు...రెండోసార్ నాలుగొందలు" అతను అరుస్తున్నాడు. ఇక ఆగలేకపోయాను.

"అయిదు వందలు" అతన్ని 3వ సారి అననివ్వకుండా అడ్డం పడ్డాను.

అప్పటికే అక్కడ జనం పల్చబడ్డారు.

"తీసుకోండిసార్ ! మంచి చౌకబేరం ఒకనాడు షాజహాన్ చక్రవర్తి పడుకొన్న మంచంసార్ ఇది" అతనిమాటలు వినిపించటంలేదు.

షాజహాన్ చక్రవర్తికి బదులు తెల్లని దుస్తుల్లో నాకు నాన్నే కనిపిస్తున్నారు. నాకళ్ళముందు నా చిన్నతనం, స్టూలుపీట వేసుకొని నేను ఆ మంచం ఎక్కి నిద్రపోవటం, నాన్నగారు కొట్టటం, నా 'మొదటి రాత్రి' ఆ మంచాన్ని నాకు వప్పచెప్పి తాను వసారాలో పడుకోవటం' అన్నీ వరసగా కనిపిస్తున్నాయి.

"మంచం విప్పేసి కట్టకట్టించమంటారా సార్ ?" అడిగేడు వేలం పాట మనిషి.

"అలాగే కట్టకట్టించి వుంచండి. ఇదిగో ఈ వంద అడ్వాన్సు. తక్కిన నాలుగు వందలూ రేపొద్దున్నే ఇచ్చి మంచం తీసుకుంటాను. వంద కాగితం అతని చేతిలో పెట్టి రోడ్డుమీదకు వచ్చాను.

క్షణం ఆలస్యం చెయ్యకుండా బస్సెక్కి ఇంటికి చేరుకున్నాను.

"ఎక్కడికి వెళ్ళేరు నాన్నా ?" లోపలకు రాగానే అడిగేడు శంకరం.

నేను జవాబు చెప్పలేదు.

"ఊళ్ళోకి వెళ్ళొచ్చారు కాబోలు !" నా బదులు అన్నపూర్ణ చెప్పింది.

కోడలు కాఫీ తీసుకొచ్చింది.

"అన్నట్టు చెప్పటం మరచిపోయాను. పందిరి మంచాన్ని అమ్మేశాను నాన్నా ! వందరూపాయలు రావటం గగనమయిపోయింది.

ఎలాగూ కొత్త ఇల్లు కొన్నాం కదా పాత మంచం ఎందుకనీ అమ్మేశాను. అదిగో చూశారా? ఆ గోడవార్న కనిపిస్తోంది చూశారా? ఆ పార్శె కొత్తమంచాలు! వెయ్యి రూపాయలు పెట్టి కొన్నాను. రేపు బిగించాలి!" కాఫీ తాగుతూ అతి మామూలు ధోరణిలో చెప్పాడు శంకరం.

నీటిపొర అడ్డుపడిన నా కళ్ళకు ఆ కొత్తమంచాలు కనిపించ లేదు...వాటి స్థానంలో నాన్నగారు నాకిచ్చిన పందిరిమంచం, దానిమీద మెత్తని పరుపు, ఆ పరుపుమీద తెల్లని దుప్పటీ, తెల్లని గలేబులు తొడిగిన తలగడాలూ, ఆ గలేబులుమీద రంగుదారాలతో అమ్మ కుట్టిన రామచిలుకలూ అవే కనిపిస్తున్నాయి...

---

❋ ఆంధ్రభూమి ఆగస్టు '82'